సాక్షి
కుమురం భీం
బుధవారం, 7, మే, 2025



గుర్తుకొస్తున్నాయి..
విద్యార్థి దశలో వేసవి సెలవులు ప్రశాంత వాతావరణంలో గడపడానికే ఇష్టపడతారు. పలువురు అధికారులు, ప్రముఖులు 'సాక్షి'తో అనుభవాలు పంచుకున్నారు. 8లో▸



పంట చుట్టూ ప్రమాదం!
రైతులు ఏర్పాటు చేస్తున్న విద్యుత్ కంచెలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. రక్షణగా ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలకు తగిలి మనుషులు ప్రాణాలు కోల్పోతున్నారు. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
37.3 /26.3
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతాయి. సాయంత్రం ఈదురుగాలులతో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి



వివరాలు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

పెంచికల్‌పేట్(సిర్పూర్): భూభారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా అన్నారు మండలంలోని చేడ్వాయి రైతువేదికలో నిర్వహిస్తున్న భూభారతి రెవెన్యూ సదస్సును మంగళవారం అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి పరిశీలించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ పెంచికల్‌పేట్ మండలం చేడ్వాయిను పైలట్ గ్రామంగా ఎంపిక చేసి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూసమస్యలు ఉన్న రైతులు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు వెంకటేశ్వర్‌రావు, కవిత, సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమ్మె తాత్కాలిక వాయిదా

ఆసిఫాబాద్‌అర్బన్: న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో ఆర్టీసీ జేఏసీ నాయకులతో మంత్రి పొన్నం ప్రభాకర్ జరిపిన చర్చలు సఫలమయ్యాయని పేర్కొన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపేందుకు ముగ్గురు ఐఏఎస్ అధికారులు నవీన్ మిట్టల్, లోకేశ్‌కుమార్, కృష్ణభాస్కర్‌తో కమిటీ ఏర్పాటు చేస్తూ జీవో విడుదల చేశారని తెలిపారు. ఉద్యోగ సంఘాలతో చర్చించి వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం కమిటీని ఆదేశించడంతో సమ్మె తాత్కాలికంగా వాయిదా వేస్తూ రాష్ట్ర జేఏసీ ప్రకటించిందన్నారు.

నేడు జిల్లాస్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో బుధవారం జిల్లాస్థాయి నెట్‌బాల్ సబ్‌జూనియర్ బాలబాలికలకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అలీబిన్, ప్రధాన కార్యదర్శి తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. 2009 మే 31కు ముందు జన్మించిన వారు అర్హులని తెలిపారు. క్రీడాకారులు ఆధార్ కార్డు, రెండు పాస్ ఫొటోలతో ఉదయం 8 గంటలకు తెలంగాణ మోడల్ స్కూల్‌కు రావాలని సూచించారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



దహెగాంలో వరిధాన్యం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ డేవిడ్

దహెగాం(సిర్పూర్): జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. మండల కేంద్రంతోపాటు లగ్గాం గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. ధాన్యంలో తేమశాతాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వరి ధాన్యంలో తేమశాతం 17కు మించకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే పంట విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు.

ముగిసిన పాలిసెట్ శిక్షణ



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీదేవి

ఆసిఫాబాద్: కాగజ్‌నగర్ పట్టణంలోని డివిజన్ రిసోర్స్ సెంటర్‌లో నిర్వహిస్తున్న ఉచిత పాలిసెట్ శిక్షణ శిబిరం మంగళవారంతో విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ సమాజంలో అసమానతలు తగ్గించడానికి విద్యే అత్యుత్తమ ఆయుధమన్నారు. జిల్లాలో పేద విద్యార్థులు అధికంగా ఉన్నందున ఉచిత శిక్షణ శిబిరాన్ని నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మధుకర్, ఎంఈవో ప్రభాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మృగాళ్ల పంజా..!



బెజ్జూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(13) ఏప్రిల్ 7న దహెగాం మండలంలోని ఓ గ్రామంలో ఉంటున్న మేనత్త ఇంటికి వచ్చింది. అదే రోజు వరుసకు మామ అయిన వ్యక్తి బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక నీరసంగా ఉండడంపై తల్లిదండ్రులు ఆరా తీయడంతో జరిగిన విషయం తెలిసింది. పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

ఏప్రిల్ 22న దహెగాం మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(11) తల్లిదండ్రులు పనికోసం చేనుకు వెళ్లారు. బాలిక ఇంటి వద్ద తన చెల్లిని ఆడిస్తుండగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదైంది.

- పసిపిల్లలపై పైశాచికత్వం
- కఠిన శిక్షలున్నా కామాంధుల్లో మార్పు కరువు
- ఆందోళన కలిగిస్తున్న వరుస ఘటనలు
- చిన్నారులకు అండగా పోక్సో చట్టం

జిల్లాలో పోక్సో కేసుల వివరాలు

సంవత్సరం	కేసులు
2022	20
2023	21
2024	27

కౌటాల(సిర్పూర్): జిల్లాలో బాలికలపై కామాంధుల దుశ్చర్యలు కలకలం రేపుతున్నాయి. పసిమొగ్గలపై పైశాచికత్వం రోజురోజుకూ పెట్రేగిపోతుంది. గంజాయి, మద్యం మత్తులో కామాంధులు వావివరసలు మర్చిపోతున్నారు. పిల్లలు అని కూడా చూడకుండా దారుణాలకు ఒడిగడుతున్నారు. ఇటీవల వరుసగా జిల్లాలోని దహెగాం మండలంలో ఇద్దరు బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన ఘటనల్లో పోలీసులు పోక్సో కేసులు నమోదు చేశారు.

పెరుగుతున్న అఘాయిత్యాలు..
దేశంలో ఎన్ని చట్టాలున్నా.. పోలీసు భద్రత ఉన్నా బాలికలకు రక్షణకు కరువవుతోంది. జిల్లాలో మైనర్లపై లైంగిక దాడులు పెరుగుతున్నాయి. వీటిలో కొన్ని వెంటనే వెలుగులోకి వస్తుండగా.. మరికొన్ని ఇతర కేసుల విచారణ సమయంలో, లేక బాధితులు అనారోగ్యానికి గురైనప్పుడో వెలుగుచూస్తున్నాయి. పరువుపోతుందన్న భయంతో కొందరు తల్లిదండ్రులు ఘటనలను దాచిపెడుతున్నారు. నిందితులు తెలిసిన వారై ఉండటం, పోలీసుల దృష్టికి వెళ్తే.. బయటకు వచ్చాక మళ్లీ వేధిస్తారన్న భయంతో ఫిర్యాదు కూడా చేయడం లేదు. పోక్సో చట్టంపై మరింత అవగాహన కల్పించాల్సి ఉండగా, బాలికల రక్షణకు సర్కారు ఇంకొన్ని కఠిన చర్యలు తీసుకోవాల్సి అవసరం ఉంది. తల్లిదండ్రులు సైతం పిల్లలను ఓ కంట కనిపెడుతుండాలని అధికారులు సూచిస్తున్నారు.

యువకులే అధికం..
మైనర్ అమ్మాయిని పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి శారీరకంగా వాడుకున్న కేసులో ఈ నెల 1న జిల్లా కోర్టు వంజిరిగూడ గ్రామానికి చెందిన చంద్రకాంత్ అనే నిందితుడికి పదేళ్ల ఏళ్ల జైలు శిక్ష, రూ.50 వేల జరిమానా విధించింది. అలాగే మైనర్ బాలికను మోసం చేసిన పోక్సో కేసులో ఆసిఫాబాద్ మండలం పర్శనంబాల గ్రామానికి చెందిన గెట్కర్ శ్రీకాంత్‌కు జిల్లా కోర్టు ఏప్రిల్ 24న జీవిత ఖైదుతో పాటు రూ.60 వేల జరిమానా విధించింది. పోక్సో కేసుల్లో పోలీసులు, కోర్టులు కఠినంగా వ్యవహరిస్తున్నా కామాంధుల్లో మాత్రం మార్పు రావడం లేదు. ఇలాంటి కేసుల్లో చాలా వరకు లైంగిక దాడులు క్షణికావేశం, మద్యం మత్తులోనే జరుగుతున్నాయని పోలీసులు చెబుతున్నారు. ఇందులోనూ యువకులే ఎక్కువగా ఉంటున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టెక్నాలజీ, సెల్‌ఫోన్లు, సినిమాల ప్రభావం ఇలాంటి ఘటనలపై ప్రభావం చూపుతోంది. తెలిసీతెలియని వయస్సులో పిల్లలు స్మార్ట్‌ఫోన్లలో అశ్లీల వెబ్‌సైట్లు, వీడియోలు చూస్తూ చెడుమార్గాన్ని అనుసరిస్తున్నారు. నేరాలకు పాల్పడి జీవితం నాశనం చేసుకుంటున్నారు.

పిల్లల బాధ్యత తల్లిదండ్రులదే..



పిల్లల బాధ్యతను తల్లిదండ్రులు తీసుకోవాలి. వారి కదలికలు, దినచర్యలో వారు ఏం చేస్తున్నారు. ఎక్కడికి వెళ్తున్నారు. వారి స్నేహితుల వివరాలు తెలిసి ఉండాలి. సమాజంలో జరుగుతున్న విషయాలపై అవగాహన కల్పించాలి. బాలిక రక్షణ చట్టాలపై కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన కల్పిస్తున్నాం. వేధించినా, ఇబ్బందులకు గురిచేసినా రక్షణ కోసం ప్రత్యేకంగా షీ టీం ఉంది. డయల్ 100కు కాల్ చేస్తే పోలీసులు రక్షణ కల్పిస్తారు.
– రామానుజం, డీఎస్పీ, కాగజ్‌నగర్

పట్టింపు అవసరం

- చాలా ఘటనల్లో తెలిసినవారే అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. ఇందుకు దహెగాం ఘటనే నిదర్శనం. తల్లిదండ్రులు పిల్లలను ఒంటరిగా వదలకుండా కనిపెట్టుకుని ఉండాలి. వారి ప్రవర్తనలో తేడాలు గమనిస్తే కారణాలు తెలుసుకోవాలి. పాఠశాల, కళాశాలకు పంపినప్పుడు అక్కడికి చేరుకున్నారో? లేదో విచారించుకోవాలి.
- ఎవరైనా ప్రేమగా మాట్లాడినా, ఆటలు ఆడినా.. చిన్నారులు వారి దగ్గరకు వెళ్తారు. అందరూ మనవారే అనే భావనలో ఉంటారు. మంచితనం ముసుగులో కొంతమంది లైంగిక దాడులకు తెగబడుతున్నారు. బాలికలకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలి.
- ఇంట్లో మగ పిల్లలు ఉంటే వారికి మహిళలు, బాలికలను ఎలా గౌరవించాలో తెలియజేయాలి. తమ శరీరంలోని సున్నితమైన భాగాలను ఎవరైనా తాకడానికి ప్రయత్నిస్తే ఎలా ప్రవర్తించాలో తెలపాలి. ఆడపిల్లలకు అవసరమైతే ఆత్మరక్షణకు కరాటే, కుంగ్‌ఫూ వంటివి నేర్పించాలి.
- పిల్లలతో రోజూ కొంత సమయం గడుపుతూ వారు చెప్పే విషయాలు శ్రద్ధగా వినాలి. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు చట్టాల గూర్చి ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టి చైతన్యం చేయాలి.
- 18 ఏళ్లలోపు పిల్లలపై జరిగే అత్యాచారాలు, వేధింపులపె పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేస్తారు. కనీసం మూడేళ్లకు తగ్గని జైలు శిక్ష, అత్యధికంగా జీవితఖైదు, అవసరమైతే జరిమానా కూడా విధిస్తారు.

తాగునీటి సమస్యలపై తక్షణమే స్పందించాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: వేసవిలో ఉత్పన్నమయ్యే తాగునీటి సమస్యలపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం మిషన్ భగీరథ పథకం ఇంజినీర్లు, జిల్లా పంచాయతీ, గ్రామీణాభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో తాగునీటి సరఫరాపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి సమస్యలపై దినపత్రికలు, ప్రసార మాధ్యమాల్లో వచ్చిన కథనాలపై స్పందించి వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రతీ మండలంలో బుధవారం తాగునీటి సమస్యలపై ఎంపీడీవో కార్యాలయాల్లో సమీక్షించాలని ఆదేశించారు. జిల్లాలోని 147 హ్యాబిటేషన్ గ్రామాల్లో ప్రత్యామ్నాయంగా నీటి ట్యాంకర్లు, బోర్‌వెల్స్ ద్వారా నీటిని అందించాలన్నారు. మిషన్ భగీరథ పైపులైన్లలో లీకేజీలకు యుద్ధప్రతిపాదికన మరమ్మతులు చేపట్టాలని సూచించారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో నీటి వృథాపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రతిరోజూ తాగునీటి వివరాలను అందించాలని ఆదేశించారు. మండల ప్రత్యేకాధికారులు, పంచాయతీ ప్రత్యేకాధికారులు తాగునీటి సరఫరాపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో డీపీవో భిక్షపతిగౌడ్, డీఆర్‌డీవో దత్తారావు, డీపీఆర్‌వో సంపత్‌కుమార్, డీఎల్‌పీవో ఉమర్ హుస్సేన్, మున్సిపల్ కమిషనర్ భుజంగ్‌రావు, మిషన్ భగీరథ ఈఈ సద్దిఖ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి
జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, లబ్ధిదారుల జాబితాలపై హౌసింగ్ కార్పొరేషన్ పీడీ, ఇంజినీర్లతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పైలట్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బేస్‌మెంట్ వరకు పూర్తిచేసిన లబ్ధిదారులకు మొదటి విడత నిధులు అందించాలని ఆదేశించారు. ఇళ్లను 600 చదరపు అడుగులకు మించకుండా నిర్మించుకోవాలని, సమస్యలు ఉంటే అధికారులను సంప్రదించాలని సూచించారు. హౌసింగ్ శాఖలో నూతనంగా నలుగురు ఇంజినీర్లు ఒప్పంద పద్ధతిన వచ్చారని తెలిపారు. మిగిలిన గ్రామాల్లో అర్హుల జాబితా రూపొందించాలని ఆదేశించారు. అనర్హుల వివరాలు ఉంటే పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో హౌసింగ్ పీడీ వేణుగోపాల్, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో నియామకాలు, జీతాల పెంపు



సిర్పూర్(టిలో) మాట్లాడుతున్న చైర్మన్ రియాజ్, పక్కన ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

- రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ ఎండీ రియాజ్

రెబ్బెన(ఆసిఫాబాద్): త్వరలో గ్రంథాలయాల్లోని ఖాళీలను భర్తీ చేసేందుకు నియామకాలు చేపట్టడంతోపాటు ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది వేతనాలు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోందని రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ ఎండీ రియాజ్ తెలిపారు. మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని మంగళవారం తనిఖీ చేశారు. అందుబాటులో ఉన్న పుస్తకాలు, రోజువారీగా వస్తున్న పాఠకుల సంఖ్య, గ్రంథాలయంలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందన్నారు. పోటీ పరీక్షలకు ఉపయోగపడేలా గ్రంథాలయాలను తీర్చిదిద్దుతున్నామన్నారు. విద్యార్థులు, యువత లైబ్రరీలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. తప్పనిసరిగా పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని సూచించారు.

పాత స్టేషన్‌లో గ్రంథాలయం ఏర్పాటు చేయాలి
మండల కేంద్రంలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న పాత పోలీస్ స్టేషన్ భవనంలో తాత్కాలికంగా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాఠకులు, విద్యార్థులు రాష్ట్ర చైర్మన్‌కు వినతిపత్రం అందించారు. ప్రస్తుతం గ్రంథాలయం కొనసాగుతున్న భవనం ఇరుకుగా ఉండటంతో ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. స్పందించిన ఆయన నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లావుడ్య రమేశ్, నాయకులు మోడెం సుదర్శన్‌గౌడ్, మడ్డి శ్రీనివాస్‌గౌడ్, దుర్గం రాజేశ్, దుర్గం అన్నాజీ, జహీర్‌బాబా, నాసిర్ ఉస్మానీ, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి
కౌటాల/సిర్పూర్(టి): జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్ అన్నారు. కౌటాల, సిర్పూర్(టి) మండల కేంద్రాల్లోని గ్రంథాలయాలను మంగళవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలోని గ్రంథాలయాలు అధ్వానంగా ఉన్నాయని తెలిపారు. కౌటాల, సిర్పూర్(టి) లైబ్రరీలకు నూతన భవనాలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు అందజేత



సమ్మె నోటీసు ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఈ నెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నామని, అలాగే 21వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్లు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం సమ్మె నోటీసు అందించారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వెలిశాల కృష్ణమాచారి మాట్లాడుతూ ఆసిఫాబాద్ మున్సిపాలిటీగా మారి 14 నెలలవుతున్నా మున్సిపల్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించడం లేదన్నారు. కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు పెండింగ్ ఉన్నాయని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేతనాలు పెంచడంతోపాటు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈ నెల 21 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు తోట సమ్మయ్య, కార్యదర్శి మాట్ల రాజయ్య, నాయకులు దుర్గాప్రసాద్, వినోద్ ఉన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్లు ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నట్లు మంగళవారం జిల్లా కేంద్రంలో డీటీడీవో రమాదేవికి వినతిపత్రం అందించారు. డైలీవేజ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణమాచారి మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన లేబర్ కోడ్‌లతో కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కార్మిక సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాంబాయి, పత్రుబాయి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

పాకిస్తానీయులను దేశం నుంచి పంపించాలి



వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: దేశంలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తానీయులను పంపించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు మంగళవారం వినతిపత్రం అందించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం మాట్లాడుతూ ఇటీవల పాకిస్తాన్ మద్దతుతో ఉగ్రవాదులు కశ్మీర్‌లో క్రూరమైన దాడికి పాల్పడి 26 మంది అమాయకుల ప్రాణాలు బలికొన్నారని తెలిపారు. భారతదేశానికి వచ్చిన పాకిస్తాన్ దేశస్తులను కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో తిరిగి పంపించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేశ్వర్‌రావు, మల్లికార్జున్, వెంకన్న తదితరులు ఉన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి
ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు బీజేపీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం మాట్లాడుతూ కెరమెరి, చింతలమానెపల్లి మండలాల్లో సరైన రోడ్లు, తాగునీటి సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటి, విజయ్, తుకారాం, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలపై వడ్డీ మోత

- ఆస్తులు తనఖా పెట్టుకుని అప్పులు
- అక్రమంగా అధిక వడ్డీ వసూలు
- ఇటీవల ఆసిఫాబాద్‌లో పలువురు వ్యాపారుల ఇళ్లలో సోదాలు



ఆసిఫాబాద్‌లోని ఓ వడ్డీ వ్యాపారి ఇంట్లో తనిఖీలు చేస్తున్న పోలీసులు(ఫైల్)

వాంకిడి(ఆసిఫాబాద్): సామాన్య ప్రజలే లక్ష్యంగా జిల్లాలో కొందరు వ్యాపారులు అక్రమంగా వడ్డీ వ్యాపారం సాగిస్తున్నారు. చిన్నపాటి వ్యాపారాలు చేసుకునే పేద, అమాయకుల అవసరాలను ఆసరాగా చేసుకుని ఆస్తులు తనఖా పెట్టుకుని అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారు. రోజూ గడవడమే కష్టంగా ఉన్న నిరుపేదలు అరకొరగా ఉన్న ఆస్తులను కష్టాకాలంలో వ్యాపారుల చేతుల్లో పెట్టేస్తున్నారు. తీసుకున్న అసలుకు సరిసమానంగా వడ్డీలు చెల్లించలేక అవస్థలు పడుతున్నారు. పట్టణ, మండల కేంద్రాల్లో బడా వ్యాపారులు వడ్డీ వ్యాపారాలు సాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గత నెల 29న జిల్లా పోలీస్ యంత్రాంగం పలువురు వడ్డీ వ్యాపారుల ఇళ్లలో సోదాలు నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది.

రైతులే అధికం..
వడ్డీ వ్యాపారానికి పేద, మధ్య తరగతి ప్రజలతో పాటు చిన్న, సన్నకారు రైతులే అధికంగా బలవుతున్నారు. ఏప్రిల్ నుంచే వ్యవసాయ క్షేత్రాల్లో వేసవి దుక్కులతో పనులు ప్రారంభమవుతాయి. రైతులు భూస్వాములు, వ్యాపారులను ఆశ్రయిస్తుంటారు. మండల కేంద్రాల్లోని ఎరువులు, విత్తన దుకాణ దారులతోపాటు, ప్రైవేటు పత్తి కాంటా యాజమానులు రైతుల అవసరాలను సొమ్ము చేసుకుంటున్నారు. అవసరాలకు అప్పులు ఇస్తూ పంట దిగుబడి అనంతరం ముక్కు పిండి అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అతివృష్టి, అనావృష్టితో కలిగే నష్టాలతో బ్యాంకు రుణాలు చెల్లించలేని పరిస్థితుల్లో రైతులు ప్రైవేట్ వారిని ఆశ్రయించాల్సి వస్తోంది.

ఏకకాలంలో దాడులు
ఆసిఫాబాద్ పట్టణంలో వడ్డీ వ్యాపారుల ఇళ్లలో ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాలతో ఏఎస్పీ చిత్తరంజన్ ఆధ్వర్యంలో ఇటీవల ఏకకాలంలో దాడులు నిర్వహించడం కలకలం రేపింది. ముందస్తు సమాచారంతో ఆసిఫాబాద్ సబ్ డివిజన్‌లో నలుగురు సీఐలు, ఎనిమిది మంది ఎస్సైలు, మొత్తం 50 మంది పోలీస్ సిబ్బందిలో ప్రత్యేక ప్రణాళికతో సోదాలు నిర్వహించారు. రూ.11 లక్షల నగదుతోపాటు బ్లాంక్ బ్యాంక్ చెక్కులు, రాయించుకున్న బాండ్ పేపర్లు, ప్రామిసరీ నోట్లు, ఏటీఎం కార్డులు సీజ్ చేశారు. ఆకస్మికంగా చేపట్టిన ఈ సోదాలతో జిల్లాలోని వడ్డీ వ్యాపారుల్లో కలవరం మొదలైంది. పట్టణ ప్రాంతాలతోపాటు మండలస్థాయి, గ్రామీణ ప్రాంతాల్లోనూ చట్ట వ్యతిరేకంగా నిర్వహిస్తున్న వడ్డీ వ్యాపారాలపై నిఘా పెంచాలని పలువురు కోరుతున్నారు.

అధిక వడ్డీలకు అప్పులు..
జిల్లాలో వందకు రూ.5 నుంచి రూ.10 వరకు వడ్డీ విధిస్తున్నారు. సామాన్యులు రుణాల కోసం బ్యాంకులకు వెళ్తే డాక్యుమెంట్లు, ఇతర ధ్రువపత్రాల పేరుతో ఖాతాల్లో డబ్బులు జమ కావాలంటే సమయం పడుతుంది. అన్నీ తెలిసిన వ్యక్తులు మాత్రమే బ్యాంకు రుణాలు పొందగలుగుతున్నారు. తొందరగా రుణాలు పొందాలనే పేదలు వడ్డీ వ్యాపారుల వద్ద బాండ్లు రాసి, లేదా ఆస్తులు తనఖా పెట్టి డబ్బులు తీసుకుంటున్నారు. దీంతో ఈ వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. గతంలో పట్టణాల్లోనే ఉన్న వడ్డీ వ్యాపారం వ్యవస్థ క్రమంగా గ్రామాలకూ పాకింది. మండల కేంద్రాలు, గ్రామాల్లో ఉండే భూస్వాములు, దుకాణదారులు ఈ దందాపై కన్నేశారు. పేదల అవసరాలను సొమ్ము చేసుకుంటున్నారు. అధిక వడ్డీలు భారంగా మారుతుండటంతో అసలు చెల్లించలేకపోతున్నారు. ఏటా వడ్డీ కడుతూ అప్పుల్లో మునిగిపోతున్నారు. అప్పులు తీర్చలేకపోతే ముందుగానే రాయించుకున్న ఆస్తులు జప్తు చేసుకుంటున్నారు. బంగారం, భూములు తదితరాలు అత్యవసర సమయాల్లో కోల్పోతున్నారు. ఇంత జరుగుతున్నా బాధితులు అప్పు తీసుకోవడమే తప్పుగా భావిస్తూ ఫిర్యాదులకు ముందుకు రావడంలేదు.

అనుమతి లేకుంటే చర్యలు



అనుమతులు లేకుండా వడ్డీ వ్యాపారాలు చేసే వారిపై చర్యలు తీసుకుంటాం. సామాన్యులతో పాటు అవసరాలను ఆసరాగా చేసుకుని అధిక వడ్డీలు వసూలు చేస్తే ఉపేక్షించేది లేదు. ఇటీవల 15 మంది ఇళ్లలో సోదాలు నిర్వహించి పదిమందిపై కేసులు నమోదు చేశాం. బాధితుల ఫిర్యాదు చేస్తే దాడులు నిర్వహిస్తాం.
– చిత్తరంజన్, ఏఎస్పీ

క్లుప్తంగా

జింకను చంపిన కుక్కలు



జింక కళేబరం

బెల్లంపల్లి: మున్సిపాలిటీలోని నంబర్–2 ఇంక్‌లైన్ బస్తీ, గోల్ బంగ్లా బస్తీ వెనకాల ఉన్న అటవీ ప్రాంతంలో మంగళవారం జింకపిల్లలు సంచరించగా వాటిపై వీధి కుక్కలు దాడి చేశాయి. అవి ప్రాణభీతితో పరుగులు పెట్టగా అందులో ఒకదాన్ని కుక్కలు చంపేశాయి. అటవీశాఖ అధికారులు ఘటనాస్థలిని పరిశీలించారు. పంచనామా చేసి జింకపిల్ల కళేబరాన్ని ఖననంచేశారు.

వంగిన మర్రిచెట్టు



నర్సాపూర్(డబ్ల్యూ)లో వంగిన మర్రిచెట్టు

లక్ష్మణచాంద: నర్సాపూర్ (డబ్ల్యూ) గ్రామంలో సోమవారం భూకంపం సంభవించింది. ఈదురుగాలులలూ వీచాయి. దీంతో చెరువు వద్ద ఉన్న మర్రిచెట్టు ఒకవైపు వంగిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు.

హెడ్ కానిస్టేబుల్‌పై దాడి

మంచిర్యాలక్రైం: భూ వివాదంలో హెడ్ కానిస్టేబుల్‌పై దాడిచేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక లక్ష్మీనగర్‌కు చెందిన కందుల రాజేశ్వర్ భూపాలపల్లిలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. స్థానిక హైటెక్ సిటీకి చెందిన నల్లాల లక్ష్మీనారాయణ, మురళి, రాజేశ్వర్ మధ్య కొంత కాలంగా భూవివాదం ఉంది. మంగళవారం భూపాలపల్లిలో విధులు ముగించుకుని రాజేశ్వర్ బస్సులో మంచిర్యాలకు వచ్చి స్థానిక టీటీడీ కల్యాణ మండపం వద్ద దిగాడు. ఇది గమనించిన లక్ష్మీనారాయణ, మురళి రాజేశ్వర్‌పై దాడి చేసి గాయపరిచారు. దీంతో రాజేశ్వర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎస్టీపీపీ సందర్శన

జైపూర్: మండల కేంద్రంలోని ఎస్టీపీపీని మంగళవారం సంస్థ అటవీ, పర్యావరణ సలహాదారు మోహన్‌చంద్ర పర్గేయిన్ (రిటైర్డ్ ఐఎఫ్ఎస్) సందర్శించారు. 2 టీఎంసీల రిజర్వాయర్లను పరిశీలించారు. వాటిపై ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ సోలార్‌ను చూశారు. నీటి కుంటలు, రక్షిత అడవులను తనిఖీ చేశారు. నేల స్వభావాన్ని బట్టి మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. అనంతరం నూతనంగా నిర్మించనున్న 800 మెగావాట్ల ప్లాంట్ స్థలాన్ని, భూమిపై ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్‌ను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఎస్టీపీపీ జీఎం శ్రీనివాసులు, డీజీఎంలు శ్రీనివాస్, అలాజుల్లాఖాన్, వాసుదేవమూర్తి, ఫారెస్ట్ మేనేజర్ చంద్రమణి తదితరులున్నారు.

గుర్తుకొస్తున్నాయి..

- వేసవి సెలవులు పల్లెటూళ్లలోనే..
- అంతా అమ్మమ్మ–తాతయ్య ఇళ్లకే..
- మధుర జ్ఞాపకాల్లోకి ప్రముఖులు

సమ్మర్ స్పెషల్



విద్యార్థి దశలో వేసవి సెలవులను ప్రశాంత వాతావరణంలో గడపడానికే ఎవరైనా ఇష్టపడతారు. కొత్త అనుభవాలు, అనుభూతులు పొందటానికి ఆసక్తి చూపుతారు. సరికొత్త నైపుణ్యాలు, విషయాలను నేర్చుకోవటానికి సిద్ధపడతారు. మరికొందరు అమ్మమ్మ–తాతయ్య ఇళ్లకు కుటుంబం, స్నేహితులతో వెళ్లి సరదాగా గడుపుతారు. 'విద్యార్థి దశలో వేసవి సెలవులు ఎలా గడిపారు' అనే అంశంపై ఉన్నత స్థానాల్లో స్థిరపడిన అధికారులు, ప్రముఖులు తమ అనుభవాలను 'సాక్షి'తో ఇలా పంచుకున్నారు.

కాలం వెనక్కిపోతే బాగుండు



మంచిర్యాల అర్బన్: వేసవి సెలవులు వచ్చాయంటే చాలు ఆసిఫాబాద్‌లోని అమ్మమ్మ ఇంటికి వెళ్లేవాళ్లం. అక్కడ నీళ్లు దొరకని సందర్భంలో ఎండ్లబండ్లపై బిందెలు పెట్టుకుని చెలిమెలు తోడి నీళ్లు తెచ్చిన సందర్భాలెన్నో. మక్కజొన్న గట్కా, చిక్కుడు, గుమ్మడి కూర, పచ్చి కూరగాయలు దొరకని సందర్భంలో రకరకాల వరుగులతో అమ్మమ్మ వంటలు ఎంతో మధురంగా చేసేది. రాత్రివేళ పెరట్లో నులక మంచాల్లో పడుకుని వెన్నెల, నక్షత్రాలను చూస్తుండేవాళ్లం. కూని రాగాలు తీస్తూ ఆదమరిచి నిదురించేవాళ్లం. అమ్మమ్మ–తాతయ్య కథలు, కావ్యగానాలు అపూర్వమైనవి. ఇంట్లో పెద్దలకు చెప్పకుండా ఎడ్లబండి కట్టుకుని వెళ్తుండగా ఒక ఎద్దు తప్పించుకుంది. అప్పుడు అందరం కలిసి బండిని లాక్కుని వచ్చి అదే స్థలంలో ఉంచేవాళ్లం. ఈతకు వెళ్లి నీటిలో మునిగి పోతుంటే తమ్ముళ్లు కాపాడిన విషయం ఎప్పటికీ మరిచిపోను. గ్రామంలో రాత్రివేళ ప్రదర్శించిన రామాయణం, డ్రామాలను ఇంటిల్లిపాదితో కలిసి చూడటం మరిచిపోని జ్ఞాపకాలు. ఒక్కసారి కాలం వెనక్కిపోతే బాగుండు అనిపిస్తోంది.

– వామన్‌రావు, కవి, సాహితీ సంరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు, మంచిర్యాల

అప్పటి తీపిజ్ఞాపకాలేవి?



నిర్మల్‌ఖిల్లా: ఆరు దశాబ్దాల క్రితం నాలుగు నుంచి పదో తరగతి వరకు ఖానాపూర్‌లో చదివాను. గోదావరి నది మా ఇంటి సమీపంలోనే ఉండేది. వేసవి సెలవుల్లో అందులో ఈత నేర్చుకునేవాళ్లం. మా అమ్మమ్మ ఊరు రాయికల్‌కు వెళ్లాలంటే గోదావరి నదిని ఎడ్లబండిలో దాటేది. ఆ తర్వాత ప్రైవేట్ వాహనంలో వెళ్లేవాళ్లం. మామిడి కాయలు కోసి దోస్తులమంతా ఉప్పు పెట్టుకుని తినేవాళ్లం. దగ్గరలోని గ్రంథాలయానికి వెళ్లి బాలలబొమ్మల పుస్తకాలు చదివేది. నమ్మక్, గిల్లీ–దండా, కోతికొమ్మ, గోలీలు, కబడ్డీ లాంటి ఆటలు ఆడేది. కొత్త ఆవకాయ, అన్నం తీసుకెళ్లి ఒత్తుగా కలుపుకొని గోదావరి ఒడ్డున కూచోని తింటూ దోసిళ్లతో నీళ్లు తాగేది. అప్పటి జ్ఞాపకాలు గుర్తొస్తే మళ్లీ కాలం వెనక్కి వెళ్తే బాగుండు అనిపిస్తుంది.

– సంపత్‌కుమార్, నవలా రచయిత, కెనడా రాయబార కార్యాలయ సీనియర్ సలహాదారు

పౌరాణిక కథలు వినేవాళ్లం



మంచిర్యాల అర్బన్: వేసవి సెలవులకు మా ఊరు పెద్దంపేట్‌కు వెళ్లేవాళ్లం. అక్కడ మా తాతయ్య అనేక పౌరాణిక కథలు చెబుతుంటే మిత్రులతో కలిసి వినేవాళ్లం. హాజీపూర్ మండలం కేంద్రంలో నాలుగో తరగతి వరకు చదువుకున్నాను. ఐదో తరగతి నుంచి ఏడో తరగతి వరకు అక్కవాళ్ల ఊరు వెల్గటూర్ మండలం చెగ్యామలకు వెళ్లాల్సి వచ్చింది. అప్పట్లో సెలవులు రాగానే అందరం పెద్దంపేట్‌కు వచ్చేవాళ్లం. మాది వ్యవసాయ కుటుంబం కావటంతో అడవికి వెళ్లి కట్టెలు తీసుకువచ్చేవాళ్లం. నానమ్మ–తాతయ్యతో కలిసి వ్యవసాయ పనులకు వెళ్తూ సరదాగా గడిపేవాళ్లం. రోడ్డు వెంట అల్లనేరేడు చెట్లుండేవి. మిత్రులతో కలిసి పండ్లు రాల్చిన రోజులు ఇప్పటికీ గుర్తున్నాయి. మోటబావి పక్కనున్న జామ చెట్టు పైనుంచి పండ్లు కిందపడగానే తిన్న రోజులు ఎప్పటికీ మరిచిపోలేను. బాల్యంలో స్నేహితులతో కలిసి గడిపిన మధురానుభూతులన్నీ ఇప్పటికీ గుర్తుకొస్తున్నాయి.

– అంజయ్య, డీఐఈవో, మంచిర్యాల

చిన్నప్పటి జిందగినే మస్తుండే..



నిర్మల్‌ఖిల్లా: ఎండాకాలంలో నిర్మల్‌లోని మా బేస్తవార్‌పేట గల్లీ దోస్తులతో దెబ్బల చెండు, మూలలాట, కుంటుడు, దేకుడు, దూకుడు, ముట్టిచ్చుకునుడు, అగ్గిపెట్టెల పత్తాలాట, సిగరెట్ పెట్టెలతో బస్సు కార్లాట, గోటిలాట, ఒక పెద్ద తాడుకు ముడేసి అందులో అందరం లైన్ కొద్ది నిలబడి ముంగటోడు డ్రైవర్, మధ్యలోడు కండక్టర్‌గా ఎన్నో ఆటల్ని ఆడుకునేటోళ్లం. చొప్పబెండ్లతో అద్దాలు, కుర్చీలు, మంచాలు, కార్లు, బస్సులు చేసుకునేటోళ్లం. తాటి ఆకులతో పంకలు చేసుకుని చేతిలో పట్టుకుని పరుగెత్తేవాళ్లం. జొన్న రొట్టెలను పప్పు, ఊరగాయ కలుపుకొని కడుపునిండా తిని వాకిట్ల బొంతలు పరిచిన మంచాల్లో ఆకాశం వైపు చూస్తూ పడుకుండేది. మా బాపువాళ్లు నిర్మల్ చరిత్ర చెప్పేటోళ్లు. రామాయణం, మహాభారతం కథలు కూడా చెప్పేది.

– ధోండి శ్రీనివాస్, నిర్మల్ చరిత్రకారుడు

మోటబావిలో ఈతకొట్టెటోళ్లం



మంచిర్యాల అర్బన్: మాది పాత వరంగల్ జిల్లా (జనగాం) నర్మెట్ట మండల బొమ్మకూర్. వేసవి సెలవులు రాగానే అమ్మమ్మ–తాతయ్య ఊరు హన్మంతపూర్‌కు వెళ్లేవాళ్లం. ఉదయం నుంచి చిన్నపిల్లలందరం కలిసి సిర్రగోనె, కబడ్డీ, చింతపిక్కలు తదితర ఆటలాడేవాళ్లం. సాయంత్రం అయిందంటే చాలు మోటబావిలో అందరం కలిసి ఈత కొట్టేవాళ్లం. ఇంటి ఆవరణలో మామిడి, వేపచెట్లు ఉండేవి. మామిడి కాయలు తెంపి కారం, ఉప్పుతో కలిపి తినటం ఇప్పటికీ మరిచిపోలేం. అమ్మమ్మ చేసే జొన్న అంబలి ఎంతో రుచిగా ఉండేది. రాత్రి కాగానే కుటుంబసభ్యులమంతా వేపచెట్టు కింద మంచం వేసుకుని, నేలపై పడుకుని కబుర్లు చెప్పుకొంటూ నిద్రలోకి జారుకునేవాళ్లం. అప్పట్లో బ్రహ్మంగారి చరిత్ర నాటకాన్ని కళాకారులు ప్రదర్శించగా ఎంతో ఆసక్తిగా చూసేవాళ్లం.

– యాదయ్య, డీఈవో, మంచిర్యాల

చెదిరిపోని జ్ఞాపకాలు



మంచిర్యాలక్రైం: వేసవి సెలవుల్లో చిర్రగోనే ఆడిన, గంగయ్యబావిలో ఈత కొట్టిన మధుర జ్ఞాపకాలు మరిచిపోలేనివి. అవి తిరిగిరాని, చెదిరిపోని జ్ఞాపకాలు. మాది సూర్యాపేట జిల్లా అర్వపెల్లి మండలం కొనపెల్లి గ్రామం. మా గ్రామానికి ఐదు కిలో మీటర్ల దూరంలో తిమ్మాపూర్ ఉండేది. ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు అక్కడే చదివాను. వేసవిలో ఒంటిపూట తర్వాత ఇంటికి వచ్చేదారిలో గంగయ్య బావి ఉండేది. ఆ బావిలో ఈత కొట్టేవాళ్లం. చింతచెట్టు కింద కబడ్డీ, చిర్రగోనె ఆడెటోళ్లం. చెరువు గట్లపై ఈత పండ్లు, మామికాయలు తెంపుకొని సాయంత్రం ఇంటికి చేరుకునేది. బడికి వేసవి సెలవులు ప్రకటించగానే నల్గొండ జిల్లా ఆకారం అనే గ్రామానికి అమ్మమ్మ ఇంటికి వెళ్లేది. అక్కడ తాటిముంజలతో గిరక బండి చేసుకుని చెరువు గట్టుపైకి వెళ్లేది. ఎడ్లబండ్లంటే నాకు చాలా ఇష్టం. గ్రామాల్లో ఊరు పెద్దమనుషులు చెట్లకింద పంచాయితీలు పెట్టుకునేవారు. అవి వినుకుంటూ చింతచెట్ల కింద చిర్రగోనె ఆడేవాళ్లం. ఎక్కువ శాతం చిర్రగోనె, కబడ్డీ ఆడుతూ.. ఈత కొడుతూ ఎంజాయ్ చేసేవాళ్లం. అవి తిరిగిరానివి, మరిచిపోలేని మధుర జ్ఞాపకాలు.

– ఎగ్గడి భాస్కర్, డీసీపీ, మంచిర్యాల

కథలు వింటూ నిద్రపోయేది



మంచిర్యాలటౌన్: మాది కాగజ్‌నగర్. వేసవి సెలవులు వస్తే కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం లింగాపూర్ గ్రామంలోని అమ్మమ్మ వాళ్లింటికి వెళ్లేది. మేము నలుగురు ఆడపిల్లలం కాగా నేనే పెద్దదాన్ని. అంతా అమ్మమ్మ ఊరిలోనే గడిపేవాళ్లం. కోతికొమ్మచ్చి, అష్టాచెమ్మా, కైలాసం, దాగుడు మూతలు, మోటబావుల్లో ఈత కొట్టడం ఇలా సరదాగా గడిపేవాళ్లం. రాత్రి ఆరుబయట మా అమ్మమ్మ చెప్పే కథలు వింటూ నిద్రించేవాళ్లం. చిన్నప్పుడే కరాటే నేర్చుకున్నాను. నెలన్నరకు పైగా వేసవి సెలవులు ఇస్తే వేగంగా గడిచిపోయేవి. అమ్మమ్మ చెప్పిన కథలు నేటికీ మర్చిపోలేను.

– నీరటి రాజేశ్వరి, జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి, మంచిర్యాల

ఆటపాటలతో గడిపేవాళ్లం



మంచిర్యాలటౌన్: మాది భీమారం గ్రామం. పుట్టి పెరిగింది అంతా అక్కడే అయినా మా అమ్మమ్మ వాళ్ల ఊరు భూపాలపల్లి జిల్లా దామరకుంట. వేసవి సెలవులు ప్రారంభం కాగానే అక్కడికే వెళ్లేవాళ్లం. మా అమ్మమ్మకు ఐదుగురు కూతుళ్లు, ఐదుగురు కొడుకులున్నారు. పది కుటుంబాల పిల్లలమంతా అమ్మమ్మ వాళ్ల ఊరికే వచ్చేది. 25 మంది వరకు ఒక్క చోట చేరడంతో పండుగ వాతావరణం నెలకొనేది. మా కుటుంబ సభ్యులమంతా కలిసి చిర్రగోనె, గోలీలు, కోతికొమ్మచ్చి, కబడ్డీ ఆడేవాళ్లం. ఈత కొట్టేవాళ్లం. చింతచెట్ల కింద రకరకాల ఆటలు ఆడేది. మా అమ్మమ్మ, పెద్దమ్మ, చిన్నమ్మ, మామయ్యలు, అత్తయ్యలు ఎన్నో కథలు చెప్పేవారు. ఆరుబయట కూర్చుని సరదా ముచ్చట్లు, కథలు, ఆటపాటలతో గడిపేవాళ్లం.

– పోటు రవీందర్‌రెడ్డి, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి

సెలవులైపోతే ఏడుపొచ్చేది



ఆసిఫాబాద్‌అర్బన్: నేను రిటైర్డ్ తహసీల్దార్‌ను. మా సొంత గ్రామం సిర్పూర్(టి) మండలం లోనవెల్లి. మేము వేసవి సెలవుల కోసం ఎదురుచూస్తుండే వాళ్లం. వార్షిక పరీక్షలు ముగిసిన మరుసటి రోజే అమ్మమ్మ ఊరు ఆసిఫాబాద్‌కు చేరుకునే వాళ్లం. బంధువులందరితో కలిసి సరదాగా గడిపేవాళ్లం. అమ్మమ్మ కట్టెలపొయ్యిపై వండిన వంట ఎంతో మధురంగా ఉండేది. ఉదయం, సాయంత్రం పెద్దవాగు ఇసుకపై ఆడుకునేవాళ్లం. వాగులో స్నానాలు, పాత ఆలయాల్లో ఆటలకు వెళ్తే సెలవులు తొందరగా గడిచిపోయేవి. సెలవుల తర్వాత ఇంటికి వెళ్లాలంటే ఏడుపొచ్చేది. అప్పటి మధుర జ్ఞాపకాలు జీవితంలో మరువలేం.

– మాసాదె శివ్‌రావ్, లోనవెల్లి

తేనెటీగల దాడిలో తాపీమేస్త్రీ మృతి

- మరో ఇద్దరికి గాయాలు

రెబ్బెన(ఆసిఫాబాద్): తేనెటీగల దాడిలో ఒకరు మృతి చెందగా ఇద్దరు గాయపడ్డారు. వివరాలు.. గోలేటి–1 ఇంక్లైన్ ప్రహరీ మరమ్మతు పనులను కాంట్రాక్టర్ పైడిధర్‌కు అప్పగించారు. మంగళవారం ఉదయం మాదారానికి చెందిన తాపిమేస్త్రీ నర్సయ్య, మైలారపు శ్రీనివాస్, హిమండి దుర్గారావు ఈ పనులకు వెళ్లారు. ఈక్రమంలో పక్కనున్న చెట్టుపై ఉన్న తేనెటీగలు వీరిపై దాడి చేశాయి. ప్రాణభయంతో పరుగులు తీసినా నర్సయ్యకు తీవ్రగాయాలు, మిగతా ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. నర్సయ్యను గోలేటిలోని సింగరేణి డిస్పెన్సరీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బెల్లంపల్లి ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు కుమార్తెలున్నారు. విషయం తెలుసుకున్న రెబ్బెన ఎస్సై చంద్రశేఖర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా, నర్సయ్యకు ముగ్గురు కూతుళ్లుండగా అందరికీ వివాహాలయ్యాయి. పెద్దకూతురు సంధ్య అన్నీ తానై తండ్రి అంత్యక్రియలు నిర్వహించింది. ఏఐటీయూసీ నాయకులు ఎస్.తిరుపతి, మారం శ్రీనివాస్, ఐఎన్టీయూసీ నాయకులు పేరం శ్రీనివాస్, టీబీజీకేఎస్ నాయకులు గజ్జెల్లి చంద్రశేఖర్, అలవేణి సంపత్ ఏరియా ఆస్పత్రికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబానికి రూ.3లక్షల పరిహారం ఇచ్చేలా కాంట్రాక్టర్‌తో మాట్లాడి ఒప్పించినట్లు వారు తెలిపారు.



తండ్రి అంత్యక్రియలు నిర్వహిస్తున్న సంధ్య

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

భైంసారూరల్: మండలంలోని గుండేగాంకు చెందిన సూర్యవంశీ ప్రసాద్ (49) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శంకర్, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రసాద్ కొన్నేళ్లుగా ఆర్థికంగా ఇబ్బంది పడుతూ అప్పులు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలని బాధ పడేవాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి జొన్న చేనుకు కాపలాగా వెళ్తున్నట్లు భార్యతో చెప్పి వెళ్లి గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భైంసాలో భారీ అగ్ని ప్రమాదం

భైంసాటౌన్: పట్టణంలోని నిర్మల్ రోడ్డులోగల ఆయిల్ ప్యాకింగ్ పరిశ్రమలో సోమవారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ఫైర్‌స్టేషన్ ఎదురుగా ఉన్న కాలనీలో శివశంకర్ ట్రేడింగ్ కంపెనీకి చెందిన ఆయిల్ ప్యాకింగ్ పరిశ్రమలో సోమవారం రాత్రి 2గంటలకు షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి యజమానికి సమాచారమవ్వగా వారు చేరుకున్నారు. అనంతరం ఫైర్ సిబ్బందికి సమాచారమివ్వగా వారు చేరుకుని మంటలార్పే ప్రయత్నం చేశారు. నూనె ప్యాకెట్లు, క్యాన్లు ఉండడంతో మంటలు పూర్తిగా అదుపులోకి రాలేదు. ఈ ప్రమాదంలో దాదాపు రూ.60లక్షల వరకు నష్టపోయినట్లు బాధితుడు తెలిపాడు.

గాయపడిన వృద్ధురాలు మృతి

గుడిహత్నూర్: మండలంలోని జాతీయ రహదారి–44పై సీతాగోంది వద్ద ఆదివారం జరిగిన ఆటో ప్రమాదంలో గాయపడిన శాంతాపూర్‌కు చెందిన దుబ్బాక పోసాని (70) తీవ్రగాయాలపాలైంది. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మిగతా వారు కోలుకుంటున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వివాహిత బలవన్మరణం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల కేంద్రంలో వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. వివరాలు.. హాజీపూర్‌కు చెందిన బొలిశెట్టి అంజయ్యకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడున్నారు. 2020 డిసెంబర్ 2న పెద్ద కుమార్తె మానూషాకు పాతమంచిర్యాలకు చెందిన గురిజాల రాకేశ్‌తో వివాహం జరిపించాడు. వీరికి మూడేళ్ల కుమారుడు బాలాన్స్ ఉన్నాడు. రెండేళ్లుగా మానూషా తీవ్ర నడుము నొప్పితో బాధపడుతోంది. రెండు నెలల క్రితం నొప్పి తీవ్రం కాగా ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించారు. అప్పటి నుంచి పుట్టింట్లోనే ఉంటోంది. ఈ క్రమంలో సోమవారం రాత్రి కుటుంబ సభ్యులంతా భోజనం చేసి నిద్రించగా మంగళవారం తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో బయటకు వచ్చి రేకుల షెడ్డుకున్న సీలింగ్ ఫ్యాన్‌కు మానూషా చీరతో ఉరేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు కిందికి దింపి చూడగా అప్పటికే మృతి చెందింది. మానూషా నడుము నొప్పి భరించలేక బలవన్మరణానికి పాల్పడినట్లు ఆమె తండ్రి అంజయ్య హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

వాలేగాంలో చోరీ

భైంసారూరల్: మండలంలోని వాలేగాం గ్రామంలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. గ్రామస్తులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిబాయి శనివారం తన ఇంటికి తాళం వేసి ఇలేగాం గ్రామానికి శుభకార్యానికి వెళ్లింది. మంగళవారం ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండగా చుట్టు పక్కలవారు గోదావరిబాయికి తెలిపారు. ఆమె ఇంటికి వచ్చి చూడగా బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడేసి కనిపించాయి. ఇంట్లోకి వెళ్లి బీరువాలోని రూ.1.80లక్షల నగదు, 5 తులాల బంగారం చోరీకి గురైనట్లు గుర్తించింది. పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బాధిత కుటుంబీకులు తెలిపారు.

ఆటోల చోరీ ముఠా అరెస్ట్

- 27 వాహనాలు స్వాధీనం
- ఐదుగురి అరెస్ట్.. పరారీలో ఇద్దరు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్: ఆటోల చోరీ ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 27 ఆటోలు స్వాధీనం చేసుకుని ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ అఖిల్ మహాజన్ జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో మంగళవారం వెల్లడించారు. ఆదిలాబాద్‌రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంపూర్ వంతెన వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో నిందితుడు షారూక్ పఠాన్ తాను దొంగిలించిన ఆటోలతో వెళ్తూ పోలీసులను చూసి పరారయ్యాడు. పోలీసులు అతడిని వెంబడించి పట్టుకున్నారు. అతడిని విచారించగా ఏడుగురు ముఠాగా ఏర్పడి ఆటోలు చోరీ చేస్తున్నట్లు ఒప్పుకొన్నాడు. హైదరాబాద్‌లో ఆటోలను దొంగిలించి వాహన, ఇంజన్ నంబర్లు మార్చి వాటి స్థానంలో నకిలీ నంబర్లు ముద్రించి అమ్మడానికి సిద్ధంగా ఉంచిన సమయంలో పోలీసులు పట్టుకున్నారు. నిందితుల్లో నార్నూర్‌కు చెందిన ఏ–1 యూసుఫ్ ప్రస్తుతం కేఆర్‌కే కాలనీలో ఉంటున్నాడు. ఈయన పరారీలో ఉండగా, జైనూర్‌కు చెందిన ఏ–2 సయ్యద్ పరారీలో ఉన్నాడు. ఆదిలాబాద్ పట్టణంలోని రణదీవెనగర్‌కు చెందిన ఏ–3 షారూక్ పఠాన్, అదే కాలనీకి చెందిన ఏ–4 అల్తాఫ్ ఖాన్, నార్నూర్ మండలంలోని నాగల్‌కొండకు చెందిన ఏ–5 షేక్ ఖయ్యూం, అదే గ్రామానికి చెందిన ఏ–6 అఫ్సర్ బేగ్, మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా మాహోర్ తాలుకా గొండ్వర్సకు చెందిన ఏ–7 అసద్ ఖాన్ ఉన్నట్లు తెలిపారు. ఏ–1, ఏ–2 పరారీలో ఉండగా, మిగతావారిని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. 27 ఆటోలకు సంబంధించిన వివరాలు తెలియగా, తొమ్మిది ఆటోల వివరాలు తెలియాల్సి ఉందని చెప్పారు. స్వాధీనం చేసుకున్న ఆటోల విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.27లక్షల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఏ–1, ఏ–2ను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను నియమించినట్లు ఎస్పీ చెప్పారు. ఎవరైనా పాత వాహనాలు అమ్మడానికి వచ్చినప్పుడు వాటి ఒరిజినల్ ఆర్సీ, చేసిస్, ఇంజన్ నంబర్లు చూసి కొనుగోలు చేయాలని సూచించారు. ఎస్పీ వెంట ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, రూరల్ సీఐ ఫణిందర్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- ఎత్తిపోతల పథకాల్లో వరుస చోరీలు
- రణవెల్లిలో చోరీ చేస్తుండగా పట్టివేత

చింతలమానెపల్లి: మండలంలోని రణవెల్లి ఎత్తిపోతల పథకంలో చోరీకి పాల్పడిన ఇద్దరిని పట్టుకున్నట్లు కౌటాల సీఐ ముత్యం రమేశ్ తెలిపారు. మంగళవారం కౌటాలలోని తన కార్యాలయంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్సై నరేశ్‌తో కలిసి వెల్లడించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలమానెపల్లి మండలం రణవెల్లి గ్రామ సమీపంలో ప్రాణహిత నదిపై నిర్మించిన ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించకపోవడంతో నిరుపయోగమైంది. మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా కేంద్రం లక్మాపూర్‌కు చెందిన డాన్‌సింగ్, గణేశ్ సోడంకి, సతీశ్ సీతారాం, రాజు సాహు, రాజోల్ సాహు ఎత్తిపోతల పథకంలోని పంపుహౌస్‌లో మోటర్లలోని రాగి తీగ చోరీ చేసేందుకు ఏప్రిల్ 13న, 19న రెక్కీ నిర్వహించారు. అదే నెల 26న పంపుహౌస్‌లోని మోటార్లను విడదీసి వెళ్లిపోయారు. విషయాన్ని వాచ్‌మన్ లెండుగురె పోశం గమనించి సమాచారమివ్వగా ఎత్తిపోతల పథకం సూపర్‌వైజర్ శ్రీకాంత్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏప్రిల్ 29న చింతలమానెపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల సూచన మేరకు పోశం మరో ఏడుగురు పంపుహౌస్‌పై నిఘా పెట్టారు. ఈనెల 4న నిందితులు మోటర్లలోని రాగితీగను బయటకు తీసి 5న రాత్రి తరలిస్తుండగా గ్రామస్తుల సాయంతో వారిని పట్టుకునే ప్రయత్నం చేశారు. ఐదుగురిలో ముగ్గురు పారిపోగా డాన్‌సింగ్, గణేశ్ గ్రామస్తులకు చిక్కారు. వీరిని చితకబాదిన గ్రామస్తులు పోలీసులకు సమాచారమిచ్చారు. అక్కడికి చేరుకున్న ఎస్సై నరేశ్ నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. సమీప చెట్లపొదల్లో దాచిన 95కిలోల రాగితీగ, 15కిలోల ప్లేట్లు, ఇతర పనిముట్లు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాపై గతంలో మహారాష్ట్రలో పలు చోరీ కేసులు నమోదైనట్లు విచారణలో తేలింది. సిర్పూర్(టి) మండలంలోని హుడ్కిలి ఎత్తిపోతల పథకంలోనూ గతంలో చోరీకి పాల్పడ్డారు. హుడ్కిలి ఎత్తిపోతల పథకంలో చోరీ చేసిన సామగ్రిని రూ.3లక్షలకు విక్రయించారు. ఎత్తిపోతల పథకంలో చోరీ చేసిన సామగ్రి విలువ రూ.1.30లక్షలు ఉంటుందని సీఐ వివరించారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ముత్యం రమేశ్

పాతకక్షలతో బ్లేడ్‌తో దాడి

మంచిర్యాలక్రైం: మద్యం మత్తులో గొడవ పడి ఒకరిపై బ్లేడ్‌తో దాడి చేసిన ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానిక సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని వడ్డెర కాలనీకి చెందిన కోట గోపి, కాండ్రగొండ రామాంజనేయులు మధ్య కొంతకాలంగా పాత గొడవలున్నాయి. ఈ కారణంగా ఇద్దరు మద్యం మత్తులో మంగళవారం గొడవపడ్డారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం గోపి తనవద్ద ఉన్న బ్లేడ్‌తో రామాంజనేయులుపై దాడి చేయగా స్వల్ప గాయమైంది. రామాంజనేయులును స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరిశీలించి అతడి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిపారు. రామాంజనేయులు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గొలుసు చోరీ నిందితుల అరెస్ట్

నిర్మల్‌టౌన్: గొలుసు చోరీలకు పాల్పడిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఏఎస్పీ అవినాష్‌కుమార్ జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. గత నెల 30న నిర్మల్ నుంచి నిర్మల్ రూరల్ మండలం వెంగ్వపేట్‌కు దంపతులు మోటార్ సైకిల్‌పై వెళ్తున్నారు. మార్గమధ్యలో కావేరి కుటీర్ వద్ద ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వారి మోటార్ సైకిల్‌ను అడ్డగించి బంగారు గొలుసు, పుస్తెల తాడు అపహరించి బైక్‌పై పరారయ్యారు. బాధితులు నిర్మల్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మంగళవారం స్థానిక మంజులాపూర్‌లోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఇద్దరు అనుమానాస్పదంగా వచ్చి పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. వెంటనే పోలీసులు వారిని పట్టుకున్నారు. నాందేడ్ జిల్లా సోనారి తాలూకాకు చెందిన బాలాజీ, రూరల్ మండలం తలవేద గ్రామానికి చెందిన అలిశెట్టి శ్రీనివాస్‌గా గుర్తించారు. వారిని విచారించగా.. దంపతుల మెడల్లోంచి చైన్, పుస్తెలతాడు దొంగిలించినట్లు ఒప్పుకొన్నారు. వారి నుంచి రెండు తులాల బంగారు పుస్తెలతాడు, తులం చైన్ స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కానిస్టేబుళ్లు సంతోష్, సత్యనారాయణను ఏఎస్పీ అభినందించారు. సీఐ కృష్ణ, ఎస్సై లింబాద్రి, సిబ్బంది ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న అవినాష్‌కుమార్, కృష్ణ